

అపు'రూప' శిల్పి

మనిషన్నాక కాసింత కళాపోషణ ఉండాలి.. అన్నాడు ఓ సినీ కవి. ఆ పదాలను గట్టిగా పట్టుకున్న కుభీర్‌కు చెందిన యువకుడు శిల్ప కళలో రాణిస్తున్నాడు. 10లో▸



నీళ్లు ఎత్తిపోయని పథకం

బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకం నిరుపయోగం గా మారిది. ఆయకట్టు రైతులు తల్లడిల్లుతున్నారు. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.3 /26.3

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుం ది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఏడాదికి 200 పని దినాలు కల్పించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఉపాధి హామీ కూలీల కూలి రూ.600 పెంచి ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అన్నారు. ఉపాధి హామీ పనుల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లతోపాటు ఇతర సిబ్బంది పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధి బడ్జెట్ రూ.2 లక్షల కోట్లకు పెంచాలని, ఉదయం సాయంత్రం రెండు ఫొటోలు తీసి పంపాలనే నిబంధన తొలగించాలన్నారు. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నరసయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బర్కుంట గంగారం, తిమ్మాపురం ముత్తన్న నాయకులు చింతకుంట శంకర్, కదాం దినేష్, బీరోళ్ల నవీన్, కూలీలు కూతాడి విజయ, నీలగిరి పోసాని పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను పంచాయతీరాజ్ డీఈ యాదగిరి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని రాచాపూర్, పొట్టపెల్లి(కె) గ్రామంలో ఇటీవల వేసిన సీసీ రోడ్లను, దుర్గామాత షెడ్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఏఈ సంజయ్‌కుమార్ ఉన్నారు.

దోమలకు చెక్ పెట్టాలి



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: దోమల అభివృద్ధిని అడ్డుకోవాలంటే లార్వా స్థాయిలోనే చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ అన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో శుక్రవారం పర్యటించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, పగిలిపోయిన రంజన్లు, ఖాళీ కొబ్బరి బోండాలు, చిప్పలు, టైర్లు, పగిలిపోయిన కుండలను తొలగించాలని సూచించారు. కూలర్లలో నీటిని వారానికి ఒకసారి పూర్తిగా తొలగించి తిరిగి నింపు కోవాలన్నారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు భోజారెడ్డి, ఆరోగ్య సహాయకులు పురుషోత్తం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చివరి దశకు సిరాల



కొనసాగుతున్న ప్రధాన తూము నిర్మాణ పనులు

- 80శాతం పనులు పూర్తి
- సాగునీటిపై రైతుల ఆశ
- వేగంగా ప్రధాన తూము పనులు

సిరాల ప్రాజెక్టు నిర్మాణం ఈ ఏడాది పూర్తయి పంటలకు నీరు అందుతుందని ఆయకట్టు రైతులు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు. రెండేళ్లుగా నీరు అందక

నీటి కోసం ఎదురుచూపు

రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారు. సిరాల ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో తానూరు మండలంలోని ఝరి, బెంబర, బోరిగాం, ఉమ్రి, బోల్సా, బోసి, బోంద్రట్, భైంసా మండలంలోని ఇలేగాం, పాంగ్రి, మాంజ్రి, దేగాం గ్రామాల్లో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గాయి. ప్రాజెక్టులో నీరు నిలిచి ఉంటే, భూగర్భ జలాలు పెరిగి, తాగునీటి, సాగునీటి సమస్యలు తలెత్తేవి కావు.

భైంసారూరల్: రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు తెగిపోయిన సిరాల ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దాదాపు చివరి దశకు చేరుకున్నారు. దీంతో 1,800 ఎకరాల ఆయకట్టు రైతుల్లో సాగునీటి ఆశలు చిగురిస్తున్నాయి. ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పనులను పర్యవేక్షిస్తూ అధికారులను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. ఇటీవల ఆయన ప్రాజెక్టు పనులను పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులతో సమావేశమై, త్వరలోనే నీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

ప్రధాన తూము నిర్మాణం..

ప్రాజెక్టు ప్రధాన తూము నిర్మాణం చివరి దశలో ఉంది. పాత తూము స్థానంలో సిమెంటుతో కొత్త షెట్టరు నిర్మిస్తున్నారు. నిజాం కాలంలో 1902లో రాతి, సున్నంతో నిర్మించిన పాత తూము లీకేజీలతో నీరు వృథాగా బయటకు వచ్చేది. భారీ వర్షాలతో తెగిపోయిన ఈ తూమును ఇప్పుడు నూతన టెక్నాలజీతో నిర్మిస్తున్నారు. సీసీ డ్రైనేజీ నుంచి నీరు తూము ద్వారా కాలువలకు చేరేలా డిజైన్ చేశారు.



తుది దశలో ప్రధాన కట్ట పనులు

కట్ట నిర్మాణం..

తెగిపోయిన కట్టను చదును చేసి, దాని అడుగు భాగంలో బండరాళ్లు పేర్చారు. చుట్టూ మట్టి, మొరం వేస్తున్నారు. ప్రధాన కట్ట నిర్మాణం చివరి దశలో ఉంది. భారీ టిప్పర్లతో మొరం, మట్టి వేస్తూ, నీరు నిల్వ ఉన్నా కట్ట తెగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వందల ఏళ్ల క్రితం నిర్మితమైన సిరాల ప్రాజెక్టు భవిష్యత్తులో భారీ వర్షాలు కురిసినా విపత్తు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది వర్షాకాలం ముందు పనులు పూర్తి చేస్తామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

కాలువలకు మరమ్మతు..

ప్రాజెక్టు పనులు తుది దశలో ఉన్న సమయంలో కాలువలపై దృష్టి సారించాలని ఇరిగేషన్ అధికారులను రైతులు కోరుతున్నారు. ఎనిమిది కిలోమీటర్ల సీసీ కెనాల్‌కు భారీ వర్షాల కారణంగా అనేకచోట్ల గండ్లు పడ్డాయి. కెనాల్‌లోని మట్టి, చెత్త, పిచ్చిమొక్కలను తొలగించి, తూముల మరమ్మత్తులు చేపట్టాలి. సిరాల, ఇలేగాం గ్రామాల మధ్య కెనాల్ పూర్తిగా అధ్వాన్నంగా ఉంది. కాలువలపై శ్రద్ధ పెడితే పంట పొలాలకు నీరు సజావుగా అందుతుందని రైతులు పేర్కొంటున్నారు.

నీరందిస్తాం

సిరాల ప్రాజెక్టు పనులు చివరి దశకుచేరుకున్నాయి. పనులు పూర్తి చేసి ఈ సీజన్‌లో రైతులకు నీరందించే విషయంపై దృష్టిపెడతాం. ఇప్పటికే ప్రధాన కట్ట పనులు చివరి దశకుచేరుకున్నాయి. ప్రధాన తూము, షెట్టరు పనులు కొనసాగుతున్నాయి. ఆయకట్టు రైతులకు నీటి ఇబ్బందులు రాకుండా చూస్తాం. త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. – అనిల్, ఇరిగేషన్ డీఈ

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్



యూనిఫాం నాణ్యత పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న అరుణ్ ఏజెన్సీ ఫర్టిలైజర్ దుకాణాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణంలోని విత్తనాలు, పురుగు మందుల ప్యాకింగ్, లేబుళ్లు, అమ్మకాల రిజిస్టర్లు, నిల్వల వివరాలు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల కారణంగా రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిషేధించిన మందులు విక్రయించొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు రెగ్యులర్‌గా దుకాణాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట వ్యవసాయ అధికారి రాజశేఖర్, తహసీల్దార్ రాజు, అధికారులు ఉన్నారు.

యూనిఫాం స్టిచ్చింగ్ నాణ్యతగా ఉండాలి..

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే యూనిఫాం(ఏకరూప దుస్తులు) స్టిచ్చింగ్ నాణ్యంగా ఉండేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఈద్గాం, మంజులాపూర్‌లో ఏర్పాటు చేసిన యూనిఫాం స్టిచ్చింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇవ్వబోయే దుస్తులు కచ్చితంగా కొలతలకు తగినట్లుగా ఉండాలన్నారు. పాఠశాలలు ప్రారంభం అయ్యేలోపు విద్యార్థులకు యూనిఫాంలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో విజయలక్ష్మి, మెప్మా పీడీ సుభాష్, విద్యాశాఖ అధికారులు లింబాద్రి, ప్రవీణ్, తహసీల్దార్ రాజు ఉన్నారు.

పుకార్లు నమ్మొద్దు

నిర్మల్‌చైన్‌గేట్: ముధోల్ మండలం బోరిగాం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అసత్య ప్రచారాలు, పుకార్లు వ్యాప్తి చేయడానికి యత్నిస్తున్నట్లు గుర్తించామని, వాటిని నమ్మొద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బోరెగాం గ్రామంలోని సర్వే నంబరు 249 లోని ప్రభుత్వ భూమిని ఇటీవల కొందరు వ్యక్తులు ఆక్రమించేందుకు యత్నించగా రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి, సంబంధిత భూమి హద్దులను గుర్తించారు. ఆక్రమణలు తొలగించారు. ఈ ఘటన నేపథ్యంలో రెవెన్యూ, ల్యాండ్ సర్వే విభాగాలకు చెందిన అధికారులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని జిల్లా యంత్రాంగం నియమించిందన్నారు. ప్రస్తుతం ఆ కమిటీ విచారణ కొనసాగిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో అక్రమాలు చోటుచేసుకోకుండా నివారించేలా జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపడుతుందని పేర్కొన్నా రు. బోరెగాం గ్రామ ప్రజలందరికీ జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

అవతరణ అతిథులు వీరే..

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను జూన్ 2న అట్టహాసంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా జిల్లా కేంద్రాల్లో నిర్వహించే వేడుకల్లో పాల్గొనే ముఖ్య అతిథుల పేర్లు ఖరారు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్‌లో వేడుకలకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ సంక్షేమశాఖల ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, కుమురంభీం ఆసిఫాబాద్‌లో రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మంచిర్యాలలో ప్రొటోకాల్, పబ్లిక్ రిలేషన్స్ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, నిర్మల్‌లో వేడుకలకు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఆయా జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించే వేడుకల్లో ఉదయం 10గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

- ఇన్‌చార్జి డీఈవో పరమేశ్వర్

నిర్మల్ రూరల్/సోన్: పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఇన్‌చార్జి డీఈవో పరమేశ్వర్ సూచించారు. పోషకుల సమావేశంలో భాగంగా నిర్మల్ రూరల్ మండలం ముఠాపూర్ ప్రాథమిక పాఠశాలలో, సోన్ మండలం న్యూవెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలలో వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో శుక్రవారం మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రతీరోజు ఉదయం రాగిజావ, మధ్యాహ్నం భోజనం కూడా అందిస్తామన్నారు. ప్రాథమిక పాఠశాల దశ నుంచి విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించబడుతున్నదని, ఈ సంవత్సరం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యా బోధన కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలతో పాటు డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్‌లు ఉన్నాయని వివరించారు. పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత గ్రామ వీడీసీలతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులపై ఉందన్నారు. పాఠశాల హెచ్‌ఎంలు సుధాకర్, విద్యాసాగర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ గోదావరి,ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సోన్ : మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో పరమేశ్వర్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

లక్ష్మణచాంద: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంట అశోక్ తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ ప్రచార జాతలో భాగంగా మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో శుక్రవారం ప్రచారం చేపట్టారు. అన్ని రకాల అర్హతలు కలిగిన, అంకిత భావంతో పనిచే ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేస్తానని వివరించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పోషకులను కోరారు.

రైతన్నా.. జాగ్రత్త!



భైంసాలోని ఓ దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

- మార్కెట్‌లో నకిలీ విత్తనాల బెడద
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

భైంసాటౌన్: మార్కెట్‌లో నకిలీ విత్తనాల విక్రయాలు రైతులకు, వ్యవసాయ రంగానికి పెను సవాల్‌గా మారుతున్నాయి. ఏటా ఏప్రిల్, మే నెలల్లో ఈ విక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నాయి. పేరు తెలియని, నాసిరకం విత్తనాల కారణంగా పంట మొలకెత్తక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సమస్యను అరికట్టేందుకు ప్రభుత్వం విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నప్పటికీ, ఫలితాలు సంతృప్తికరంగా లేవన్న విమర్శలు వస్తున్నాయి.

నాన్‌బ్రాండెడ్ విత్తనాల వల..

ఈ సీజన్‌లో వర్షాలు ముందుగానే ప్రారంభం కావడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. దీంతో మార్కెట్‌లో విత్తనాల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. అయితే, ఇదే అదునుగా కొందరు వ్యాపారులు నాన్‌బ్రాండెడ్, నకిలీ విత్తనాలను తక్కువ ధరకు అమ్ముతూ రైతులను మోసం చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలో పత్తి, సోయా, వరి విత్తనాల్లో నాన్‌బ్రాండెడ్ రకాలు ఎక్కువగా చెలామణి అవుతున్నాయి. అనధికార మార్కెట్ ద్వారా ఈ విత్తనాలు విక్రయిస్తున్నారు.

తనిఖీలు నామమాత్రమేనా?

నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వం వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ, సీడ్ కార్పొరేషన్ శాఖలతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తూ, నకిలీ విత్తనాల విక్రయాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాయి. అయినా ఈ తనిఖీలు నామమాత్రంగా జరుగుతున్నాయని, వ్యవసాయ శాఖ అధికారులు కొందరు డీలర్లతో లోలోపలి సంబంధాలు కలిగి ఉండడం వల్ల తనిఖీలు పూర్తిస్థాయిలో జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

అప్రమత్తంగా ఉండాలి..

నకిలీ విత్తనాల సమస్య నుంచి రైతులను కాపాడేందుకు అధికారులు తనిఖీలను ముమ్మరం చేయాలని, అదే సమయంలో రైతులకు నాణ్యతా విత్తనాల గుర్తింపుపై అవగాహన కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు. రైతులు కూడా బ్రాండెడ్, ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, తక్కువ ధరలకు ఆకర్షితులై నాన్‌బ్రాండెడ్ విత్తనాలను కొనకుండా జాగ్రత్త వహించాలని సలహా ఇస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం...

ప్రభుత్వ ఆదేశాలతో విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నాం. స్టాక్ నిల్వలు, రిజిస్టర్లు పరిశీలిస్తున్నాం. ఎవరైనా నకిలీ, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం. గడువు ముగిసిన క్రిమిసంహారక మందులు విక్రయించొద్దు. – కోమల్‌రెడ్డి, ఆర్డీవో, భైంసా

బుద్ధ విగ్రహం తొలగింపుపై నిరసన

- భైంసా–బాసర జాతీయ రహదారిపై అంబేడ్కర్ వాదుల ఆందోళన
- బోరిగాం ఘటనపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్

ముధోల్ : ముధోల్ మండలం బోరిగాం గ్రామంలో ఇటీవల బుద్ధుని విగ్రహం తొలగింపు ఘటనపై దళిత సంఘాలు, అంబేడ్కర్‌వాదులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. న్యాయం కోరుతూ శుక్రవారం ముధోల్ మండల కేంద్రంలో భైంసా–బాసర జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు నిరసనలో పాల్గొన్నారు. రాస్తారోకో కారణంగా జాతీయ రహదారిపై సుమారు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. బుద్ధుని విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు కలెక్టర్ హామీ ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సుమారు 5 గంటల పాటు ఆందోళన చేశారు. ప్రభుత్వ స్థలంలో ప్రతిష్ఠించిన బుద్ధుని విగ్రహంపై దాడులు జరగడం బాధించిందని పలువురు పేర్కొన్నారు. న్యాయం చేయాల్సిన అధికారులు మొండి వైఖరి అవలంబిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



భైంసా–బాసర జాతీయ రహదారిపై బైఠాయించిన ఆందోళనకారులు

అధికారుల హామీతో..

ఎస్పీ జానకీ షర్మిల శాంతియుతంగా చర్యలు చేపడతామని చెప్పినానిరసనకారులు కలెక్టర్ నుంచి స్పష్టమైన హామీ కోరారు. ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్కతో చర్చలు జరిపారు. మంత్రి సంబంధిత అధికారులకు బుద్ధ విగ్రహం పునఃప్రతిష్ఠకు స్థలం కేటాయించాలని ఆదేశించారని విఠల్‌రెడ్డి, ఆర్డీవో కోమల్‌రెడ్డి తెలిపారు. రాబోయే సోమవారం బుద్ధ విగ్రహం ఆవిష్కరణ, బౌద్ధ పతాక ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని, ప్రభుత్వమే కాంస్య విగ్రహం నిర్మించి అందిస్తుందని హామీ ఇచ్చారు.

పోలీసుల నిఘా

మండలంలోని బోరిగాం గ్రామంలో ఉద్రిక్తతల దృష్ట్యా శుక్రవారం పోలీసులు నిఘా పటిష్టం చేశారు. దళిత సంఘాలు శుక్రవారం చలో బోరిగాంకు పిలుపునిచ్చారు. దీంతో ఎలాంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా ఎస్పీ జానకీషర్మిల ఆదేశాల మేరకు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ఉపేంద్రారెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల నుంచి దళిత నాయకులు అధిక సంఖ్యలో తరలివస్తారని సమాచారం మేరకు ఉదయం నుండే పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేశారు. తనిఖీలు నిర్వహించారు. సుమారు 150 మంది పోలీసు సిబ్బందితో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. బందోబస్తును ఎస్పీ జానకీషర్మిల పర్యవేక్షించారు. గ్రామంలో ఉండి భద్రతను స్వయంగా పర్యవేక్షించారు.



నిరసనకారులను సముదాయిస్తున్న ఎస్పీ

ధాన్యం తరలించాలని రైతుల ఆందోళన

నర్సాపూర్(జి): ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలోని తురాటి గ్రామ ఎక్స్‌రోడ్ వద్ద 61వ జాతీయ రహదారిపై శుక్రవారం రైతులు ధర్నా చేపట్టారు. ఈనెల 27న డొంగుర్గాం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన గొర్ల ప్రవీణ్‌కు చెందిన 1100 బస్తాల ధాన్యాన్ని ఒక లారీ, 4 ట్రాక్టర్లలో మామడ, కుంటాల, వానల్‌పాడ్, భైంసా రైస్ మిల్లులకు పంపారు. తేమశాతం సరిగా లేదనే కారణంతో మిల్లర్లు వాటిని గురువారం వెనక్కి పంపించారు. గురువారం రాత్రి వర్షం కురవడంతో మళ్లీ ధాన్యం తడిసింది. దీంతో శుక్రవారం రైతులు రోడ్డెక్కి నిరసనకు దిగారు. ఒకవైపు తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నారని, మిల్లర్లు మాత్రం తిప్పి పంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్సై సాయికిరణ్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. సుమారు గంటపాటు రైతులు రాస్తారోకో చేపట్టడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం రైతులు తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించి సమస్య పరిష్కరించాలని కోరారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్

గురుకులంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల విద్యాలయం ఏర్పాటు చేసి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 25 ఏళ్లలో గురుకులంలో చదువుకున్న అందుబాటులో ఉన్న విద్యార్థులందరికీ పాఠశాల సిబ్బంది ఆహ్వాన పత్రాలు పంపించారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను, పాఠశాలతో తమకున్న అనుబంధాలను పంచుకున్నారు. అనంతరం అప్పట్లో తమకు చదువు నేర్పిన గురువులను సత్కరించారు. అప్పటి ప్రిన్సిపాల్ చలపతి, ప్రస్తుత ప్రిన్సిపాల్ సంగీత, గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకల్లో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

శ్రీరాంపూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధి తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో ఉన్న ఏఎస్ఆర్ వైన్స్‌లో ఈ నెల 21న చోరీకి పాల్పడిన నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. వైన్ షాప్ షట్టర్ తాళం పగులగొట్టి రూ.12 వేల నగదు ఎత్తుకెళ్లారని యజమాని రాముల సుగుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గురువారం సాయంత్రం సీసీసీ కార్నర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గోదావరిఖని నుంచి మంచిర్యాల వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న కట్ట అన్సార్ అను మానాస్పదంగా కనిపించగా విచారణలో నిందితుడిగా తేలిందని అన్నారు. అన్సార్, అతడి స్నేహితుడు హేమంత్ చోరీకి పాల్పడ్డారని, హేమంత్ పరారీలో ఉన్నాడని తెలిపారు. అన్సార్ నుంచి రూ.1000 నగదు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని శుక్రవారం రిమాండ్ చేసినట్లు తెలిపారు. సీసీసీ నస్పూర్ పోలీసులను మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, ఏసీపీ ఆర్.ప్రకాష్ అభినందించారు.

కల్లు దుకాణం సీజ్



కల్లు దుకాణాన్ని సీజ్ చేసిన పోలీసులు

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల్ ఎక్స్ రోడ్ సమీపంలోని కల్లు దుకాణాన్ని ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. కల్లు దుకాణంలో చిన్నపిల్లలతో పనులు చేయిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో పట్టణ పోలీసుల సహాయంతో ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. ఎక్సైజ్ యాక్ట్ 1968 ప్రకారం షాపును సీజ్ చేశారు. కల్లు షాపులలోగానీ, వైన్ షాపలలో గానీ మైనర్లను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఢీకొట్టి వెళ్లిన వాహనం పట్టివేత

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి మదర్ థెరిస్సా పాఠశాల సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని కన్నెపల్లికి చెందిన బోరె మహేష్(32) మృతిచెందిన విషయం తెలిసిందే. అతడిని ఢీకొట్టి తప్పించుకున్న వాహనాన్ని పట్టుకునేందుకు ఎస్సై తహసీనొద్దీన్ రాత్రంతా తమ సిబ్బందితో కలిసి గాలించారు. గూడెం అటవీ చెక్ పోస్టు సమీపంలో సీసీ ఫుటేజీ పరిశీలించగా అశోక్‌లీలాండ్ గూడ్స్ వాహనం ఢీకొట్టినట్టు గుర్తించారు. వాహన నంబరు ఆధారంగా హన్మకొండ సమీపంలో పట్టుకుని దండేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చారు. వాహనయజమాని, డ్రైవర్ అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఒప్పందాలు అమలు చేయాలి

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై పలు దఫాలుగా హైదరాబాద్‌లో డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమిషనర్ వద్ద యాజమాన్యం అంగీకరించిన ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులుకు శుక్రవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మిక సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం బీఎంఎస్ అనుబంధ ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ దుస్స భాస్కర్‌తో కలిసి మాట్లాడారు. ఒప్పందం ప్రకారం క్యాంటీన్ సదుపాయం కల్పించినా సబ్సిడీ ధర్‌పై కొనసాగించాలని తెలిపారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించినప్పటికీ విద్యార్హతకు తగిన ఉద్యోగాలు ఇవ్వాలని, ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు. ప్రతీ కార్మికుడికి రూ.5వేల అలవెన్సు అదనంగా చెల్లించాలని, క్యాజువల్ లీవ్, సిక్, వేతన లీవ్, ఫ్లేడేలు పీహెచ్‌డీలు చెల్లించే మాదిరిగా చూడాలని కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామంలో లక్కడి గంగారెడ్డి చెందిన గేదె శుక్రవారం కరెంటు షాక్‌తో మృతిచెందింది. బాధిత రైతు తెలిపిన ప్రకారం.. ఉదయం మేతకు పుస్పూర్ నుంచి నర్సింహానగర్ తండాకు తీసుకెళ్లారు. అప్పటికే విద్యుత్ వైర్లు తెగిపడడంతో ప్రమాదావశాత్తు గేదే వాటికి తగలడంతో గేదె అక్కడికక్కడే మరణించింది. గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. పరిహారం చెల్లించాలని వేడుకున్నాడు.

అపురూప శిల్పి



శిల్పాలు చెక్కుతున్న సాయిశ్యాం

- శిల్పాలతో ఉపాధి పొందుతున్న సాయిశ్యాం
- శిల్పకళాధామం ఏర్పాటుచేసి పలువురి ఉపాధి..
- ఐదు జిల్లాలకు ఇక్కడి నుంచే విగ్రహాలు..

కుభీర్: మనిషన్నాక కాసింత కళాపోషణ ఉండాలి.. అన్నాడు ఓ సినీ కవి. ఆ పదాలను గట్టిగా పట్టుకున్న కుభీర్‌కుచెందిన యువకుడు తన పూర్వీకుల నుంచి వస్తున్న కళను నమ్ముకున్నాడు. ఆదరణ లేని వృత్తే అయినా.. దానిని సరికొత్తగా ఆవిష్కరించాలనుకున్నాను. ఆధునిక విధానంలో పాత కళకు ప్రాణం పోస్తున్నాడు. తాను ఉపాధి పొందుతూ మరో ఐదుగురికి ఉపాధి కల్పిస్తున్నాడు. కుభీర్‌లో శిల్పకళకు ఆధునిక రూపం ఇస్తూ, కళాకారుడు సాయిశ్యాం. విశ్వకర్మ శిల్పకళాధామాన్ని స్థాపించి, తనకు ఉపాధి సమకూర్చుకోవడమే కాక, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాడు. ఈ కళాధామంలో ప్రస్తుతం ఐదుగురు యువకులు పనిచేస్తుండగా, అవసరాన్ని బట్టి మరికొందరిని కూడా నియమించుకుంటున్నారు.

కళాకారుల వంశం

సాయిశ్యాం కుటుంబం మొత్తం కళాకారులతో నిండి ఉంది. ఆయన తాత వద్ల పెద్దన్న కట్టెతో విగ్రహాలు తయారు చేయడంతోపాటు జానపద గురుభోద పాటలు రాసేవారు, పాటలు పాడేవారు. తండ్రి శంఖర్ సిమెంట్, మట్టితో విగ్రహాలు తయారు చేస్తారు. తమ్ముడు నరేశ్ విగ్రహాల తయారీలో సాయిశ్యాంకు సహకరిస్తూ, నైపుణ్యం కలిగిన పెయింటర్‌గా కూడా పనిచేస్తున్నాడు. సాయిశ్యాం ఇంటర్మీడియట్, డ్రాయింగ్‌లో టీచర్ ట్రైనింగ్ కోర్సు(టీటీసీ) పూర్తి చేసి, ప్రస్తుతం ఉన్నత పాఠశాలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడిగా క్రాఫ్ట్, డ్రాయింగ్ బోధిస్తూ, మిగిలిన సమయంలో కళాధామంలో పనిచేస్తున్నారు.

విగ్రహాల తయారీలో నైపుణ్యం

సాయిశ్యాం నల్లరాయి, కృష్ణశిల, ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపీ), సిమెంట్, సుద్దమట్టితో రకరకాల విగ్రహాలు తయారు చేస్తారు. లక్ష్మి, సరస్వతి, గణపతి, కృష్ణుడు, శంకరుడు, ఎల్లమ్మ, పోచమ్మ వంటి దేవీదేవతల విగ్రహాలతోపాటు, శివాజీ, వివేకానంద, గాంధీజీ, అంబేద్కర్ వంటి దేశ నాయకుల, మహాత్ముల విగ్రహాలను కూడా నైపుణ్యంతో రూపొందిస్తారు. ఆర్డర్, అడ్వాన్స్ ఆధారంగా విగ్రహాలు తయారు చేసి ఇస్తారు. ఇక్కడి నుంచి నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, మహారాష్ట్రలోని గ్రామాలకు విగ్రహాలు పంపిస్తాడు. కళాధామంలో పనిచేసే కార్మికులకు జీతాలు, ఇతర ఖర్చుల కోసం సంవత్సరానికి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు ఖర్చవుతాయని సాయిశ్యాం తెలిపారు.

అవార్డులు, గుర్తింపు

సాయిశ్యాం కళాప్రతిభకుగాను అనేక అవార్డులు అందుకున్నారు. 2013లో హైదరాబాద్‌లో ట్రూ ఇండియన్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో అప్పటి హోం మంత్రి జానారెడ్డి చేతుల మీదుగా అవార్డు పొందారు. 2014లో తెలంగాణ ప్రభుత్వం, 2018లో గోల్కొండ క్రాఫ్ట్స్ సంస్థ నుంచి అవార్డులు అందుకున్నారు. 2025 జనవరి 26న కలెక్టర్ అభిలాష చేతుల మీదుగా ప్రశంసా పత్రం పొందారు.

భవిష్యత్ ఆకాంక్షలు

2015లో స్థాపించిన విశ్వకర్మ శిల్పకళాధామం ద్వారా సాయిశ్యాం అనేక మంది యువతకు ఉపాధి కల్పిస్తున్నారు. అయితే, ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని, సహాయం అందితే మరింత మందికి శిల్పకళ నేర్పించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని సాయిశ్యాం తెలిపారు.



విశ్వకర్మ శిల్పకళాధామం



సాయిశ్యాం చెక్కిన విగ్రహాలు



తయారు చేసిన విగ్రహాలు

బాసరకు పోటెత్తిన భక్తులు



ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ



చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు

బాసర: బాసరలో చదువుల తల్లి శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మరికొన్ని రోజుల్లో విద్యా సంస్థలు తెరుచుకోనున్నాయి. దీంతో అమ్మవారి దర్శనానికి వారం రోజులు గా భక్తులు భారీగా వస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు వచ్చి అమ్మవారి ని దర్శించుకుని చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయిస్తున్నారు. శుక్రవారం ఆలయానికి వచ్చిన భక్తులు వేకువజామున గోదావరిలో పుణ్యస్నానాలు చేసి శ్రీమహాలక్ష్మి, శ్రీసరస్వతి, శ్రీమహాకాళి అమ్మవార్లను దర్శించుకున్నారు. అక్షరాభ్యాస మండపంలో ఆలయ అర్చకులు అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు జరిపించారు. రూ.1000 అక్షరాభ్యాస టికెట్లు 255, రూ.150 అక్షరాభ్యాస టికెట్లు 650 విక్రయించారు. ఇతర ఆర్జిత సేవల ద్వారా మొత్తం రూ. 8.70 లక్షలకు పైగా ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అటవీ అధికారులపై కేసులు పెట్టాలి

బెల్లంపల్లి: పేద దళిత రైతులపై దాడులు చేస్తున్న అటవీ అధికారులపై కేసులు నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట బాధిత రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామానికి చెందిన దళిత రైతులు సర్వే నంబర్ 65, 67లో ఉన్న భూములను ఐదు దశాబ్దాల నుంచి సాగు చేసి జీవిస్తున్నారని తెలిపారు. అటవీ అధికారులు అడ్డుతగులుతూ దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం డీఏఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు బి.కేశవరెడ్డి, రైతులు బానయ్య, లింగయ్య, సతీష్, రాజయ్య, పర్వతాలు, మహిళలు పాల్గొన్నారు.



డీఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏమాజీ, రైతులు

మాంత్రికుడి అరెస్ట్



నిందితుడు అభినయ్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళను మంత్రపూజల ద్వారా నయం చేస్తానని ఆమెపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ మహిళకు అనారోగ్య సమస్య ఉండడంతో కుటుంబ సభ్యులు ఓ వ్యక్తి సలహా మేరకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా సార్వానికి చెందిన అభినయ్‌కుమార్‌ను పిలిపించారు. అభినయ్‌కుమార్ గురువారం రాత్రి పూజల పేరిట మహిళను గదిలోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు మహిళ కేకలు వేయగా కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు అభినయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. బాధిత మహిళకు అవసరమైన వైద్య, మానసిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ సమావేశానికి మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు, ఒలంపిక్ అసోసియేషన్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్లుగా ఆర్.నారాయణరెడ్డి, గడ్డం జగన్నాథం, కేపీ ప్రతాప్, జి.భీమ్లానాయక్, అధ్యక్షుడిగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కె.భాస్కర్, బి.గోవర్ధన్ రెడ్డి, జి.ఈశ్వర్, వి.మహేందర్, మారిన శృతి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.తిరుపతి, కోశాధికారిగా యు.శంకర్, సంయుక్త కార్యదర్శులుగా మారిన వెంకటేశ్వర్లు, ఆర్.గోపాల్, సాంబశివరావు, ఎల్.హరిలాల్, అంకం సరిత, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.భానయ్య, కార్యవర్గ సభ్యులుగా మారిన చందర్, గుజ్జ మల్లేశ్, ఆర్‌వీ రామకృష్ణ, కె.మల్లేష్, సతీష్, రెడ్డి సతీష్, జి.శ్రీధర్, పి.శ్రీనివాస్, ఏ.జ్యోతి, జి.వెంకన్న, క్రాంతికుమార్, శరత్‌యాదవ్, సలహాదారులుగా ఎం.లక్ష్మణ్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, పి.సాంబయ్య, సదానందం, వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

కేసులకు భయపడేది లేదు..

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- బాధితుడికి పరామర్శ



కందుల ప్రశాంత్ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్సీ కవిత

శ్రీరాంపూర్: కాంగ్రెస్ సర్కార్‌లో అక్రమ కేసులను భయపడేది లేదని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. శుక్రవారం ఆమె నస్పూర్‌లో పర్యటించారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు కందుల ప్రశాంత్‌పై ఇటీవల సీసీసీ నస్పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఊరు శ్రీరాంపూర్‌లోని ఆయన నివాసానికి ఆమె వెళ్లి అతడితోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అక్రమ కేసులకు భయపడవద్దని, పార్టీ, తాను అండగా ఉంటామని చెప్పారు. కేసులతో జాగృతి నాయకులు, కార్యకర్తలను బెదిరించలేరని, తాను ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. అనంతరం నస్పూర్ కాలనీలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఊరు శ్రీరాంపూర్ వద్ద కవితను అభిమానులు గజమాలతో సత్కరించగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు కందుల ప్రశాంత్, సింగరేణి జాగృతి శ్రీరాంపూర్ కన్వీనర్ కుర్మ వికాస్, కార్యకర్తలు రత్నాకర్‌రెడ్డి, తొంగల రమేశ్, వినయ్ పాల్గొన్నారు.

జర్నలిస్టు మునీర్ కుటుంబానికి పరామర్శ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఎండి.మునీర్ గత శనివారం మృతిచెందగా.. శుక్రవారం ఆయన నివాసంలో మునీర్ భార్య రిజ్వానా, కుమారుడు మయూర్, కూతుళ్లు ముజిభా, రేష్మా, తన్వీర్ గౌసియా, తమ్ముళ్లు సందాని, మొహియోద్దీన్లను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునీర్ తెలంగాణ ఉద్యమానికి చాలా కృషి చేశారని అన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకులు బ్రహ్మానందం పాల్గొన్నారు.

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: ఎమ్మెల్సీ కవిత శుక్రవారం మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యంలో లక్సెట్టిపేట పట్టణంలో ఆగారు. పట్టణానికి చెందిన జాగృతి నాయకురాలు నిషా, విశ్రాంత ఉద్యోగి విజయసారథి ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జన్నారం మాజీ జెడ్పీటీసీ ఎర్రం చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

గులాబీ శ్రేణుల దూరం..

కవిత పర్యటనకు బీఆర్ఎస్‌తోపాటు టీబీజీకేఎస్ నేతలు దూరంగా ఉన్నారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న ఆమె సింగరేణి క్షేత్రంలో పర్యటించిన సందర్భంలో నేతలెవ్వరూ హాజరు కాలేదు. కనీసం మర్యాద పూర్వకంగానూ కలువకపోవడం సింగరేణిలో తీవ్ర చర్చనీయాశంగా మారింది. గతంలో ఆమె సింగరేణి ప్రాంతాల్లో పర్యటించినప్పుడు కార్మికులు, కార్మిక నేతలతో పెద్ద కాన్వాయ్ వెంట ఉండేది. నేతల హడావిడి చెప్పనక్కర్లేదు. కానీ నేడు ఎలాంటి హంగు ఆర్భాటాలు కనిపించలేదు. పార్టీపై ఆమె చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో దూరంగా ఉన్నారా అన్న చర్చ జరుగుతోంది.

మేకను కాపాడబోయి..

- బావిలో చిక్కుకున్న కాపరి



బావిలో మేకల కాపరి

బోథ్: మేకను కాపాడబోయి కాపరి బావిలో చిక్కుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన ఓ మేకల కాపరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద గల వ్యవసాయ క్షేత్రంలో మేకలను మేతకు తీసుకువచ్చాడు. ఈ క్రమంలో వ్యవసాయ క్షేత్రంలోని బావిలో ప్రమాదవశాత్తు ఓ మేక పడిపోయింది. గమనించిన కాపరి మేకను కాపాడాలని బావిలోకి దిగాడు. తనకు తోడుగా వచ్చిన వ్యక్తి బావి బయట ఉండడంతో మేకను తాడు సాయంతో పైకి పంపించాడు. ఆ తర్వాత అతనూ పైకి రావడానికి నానా ఇబ్బందులు పడ్డాడు. స్థానికులు గమనించి అతడిని అతికష్టం మీద బయటకు తీశారు. విషయం తెలుసుకుని పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇచ్చోడ నుంచి ఫైరింజన్ కూడా వచ్చింది. అప్పటికే కాపరి బావి నుంచి బయటకు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ కోసం పోలీసుల గాలింపు?

- ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో కేసు నమోదు
- పోలీస్ విచారణకు హాజరుకాని అధికారి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌లో మున్సిపల్ భూమిని ఓ వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేయగా మున్సిపల్ అధికారులు వన్‌టౌన్ పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో కబ్జాకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో పోలీసులు విచారణ చేపట్టారు. కబ్జా చేసిన వ్యక్తి పోలీసులకు వివరాలు వెల్లడించినట్లు సమాచారం. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న జాదవ్‌కృష్ణ ఇదివరకు ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఆర్వోగా పనిచేశారు. ఆ సమయంలో ఫీల్డ్ విజిట్ చేసి ఇచ్చిన ధ్రువీకరణతో మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్ కేటాయించారు. దీంతో వారు మ్యుటేషన్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఉందనే కోణంలో పోలీసులు విచారణ జరిపారు. మున్సిపల్ కమిషనర్‌కు పోలీసులు లేఖ రాశారు. దీంతో ఆ సమయంలో రెవెన్యూ ఆఫీసర్‌గా జాదవ్‌కృష్ణ ఫీల్డ్ విజిట్ చేసినట్లు నిర్ధారించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ స్థలంగా తప్పుడు నివేదిక అందించిన సదరు అధికారిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పలుసార్లు కృష్ణను పోలీసులు దర్యాప్తునకు పిలవగా, హాజరు కాకుండా తప్పించుకు తిరిగాడు. దీంతో పోలీసులు అరెస్ట్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈక్రమంలో ఆయన అందుబాటులో లేకుండా పోయినట్లు సమాచారం. విధులకు గైర్హాజరు కావడంతో నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ఖలీల్ అహ్మద్ (46) పంజాబ్ చౌక్ నుంచి రైల్వేస్టేషన్ వైపు ఆటోలో వెళ్తున్నాడు. ఆ సమయంలో పంజాబ్ చౌక్‌లో రోడ్డుపై ట్రాక్టర్ నిలిపి ఉంది. ఆ ట్రాక్టర్ ముందుకెళ్తున్నట్లు గమనించిన ఆటో డ్రైవర్ టర్న్ చేశాడు. ఈ క్రమంలో ఆయన తల ట్రాక్టర్ వెనుక భాగానికి తాకడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు టూటౌన్ సీఐ సునీల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

చెట్టు పైనుంచి పడిన వ్యక్తికి గాయాలు



క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న ఈఎంటీ మురళీ

కడెం: మండలంలోని దోస్త్‌నగర్ గ్రామానికి చెందిన బూద దేవయ్య శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. మేకల మేత కోసం చెట్టు ఎక్కిన దేవయ్య పట్టు తప్పడంతో కిందపడ్డాడు. కాలుకు తీవ్ర గాయమైంది. స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జగిత్యాల ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడిన దినేష్, లావణ్య

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుప్యా తండాకు చెందిన లావణ్య, ఆమె భర్త రాథోడ్ దినేష్ ద్విచక్ర వాహనంపై పెట్రోల్ బంకులో పెట్రోలు పోయించుకుని తిరిగి నిర్మల్‌వైపు వెళ్తున్నారు. ఇదే సమయంలో అతివేగంగా సారంగాపూర్‌వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భూమేశ్ వారి వాహనాన్ని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో లావణ్య, దినేష్‌కు స్వల్ప గాయాలు కాగా భూమేష్‌కు తలకు గాయమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.